# ‘సతి’కి పిల్లలుంటే? సంతతీ సహగమనంచెయ్యాలా?

భర్తని పోగొట్టుకున్న దౌర్భాగ్యురాలికి బతికే హక్కు లేదన్నారు, బాగానే వుంది. భార్యని పోగొట్టుకున్న భర్త నిప్పుల్లో దూకక నిక్షేపంగా మళ్ళీ పెళ్ళికొడుకై చక్కగా సంసారం చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు, బాగానే వుంది. కానీ ఈ ‘సతి’ నియమ నిబంధనలు ఎవరు సృష్టించారోగానీ, కొన్ని సందేహాలు మిగిలిపోయేలా చేశారు! వాటి గురించి ఎవరూ చర్చించినట్టులేదు.

‘సతి’ సహగమనం చేసేస్తే, ఆమె సంతతి ఏం కావాలి? తండ్రిని పోగొట్టుకున్న చిన్నారులు, తల్లి ప్రేమకు కూడా దూరమై, అనాధలుగా బతకాలా. ఎవరి అండదండలనో ఆశ్రయించి, వారి దయాదాక్షిణ్యాలపైన బతకాలా? ఎవరూ చూడకపోతే, నిలువనీడ కరువైతే అడుక్కుతినాలా? లేకపోతే, తండ్రి మరణానికి చింతిస్తూ, తల్లి సహగమనానికి దుఃఖిస్తూ వారూ ఆ తల్లిదండ్రుల చితిలో పడి భస్మం కావాలా?

అసలు పిల్లలున్న సతి సహగమనం చెయ్యాలా? పిల్లలు లేని సతే సహగమనానికి అర్హురాలా? ఇవన్నీ మామూలు ప్రశ్నలు కావు! బాగా ఆలోచిస్తే ‘సతి’ని శాస్త్రంగా రూపొందించిన వారు ఎంత తెలివైన వారో అర్థమవుతుంది!

పిల్లలులేని స్త్రీయే సహగమనం చెయ్యాలీ అనడంలోని అంతరార్థం ఒక్క నిమిషం ఆలోచిస్తే, అర్థమవుతుంది! ఎక్కడ ఆమె మళ్లీ పెళ్లి చేసుకుని సుఖపడి పోతుందోననే మగవాడి మనస్తత్వమే, ఈ ‘సతి’కి దారితీసిందని పిస్తుంది. ఆడవాళ్ళ అసూయ కొట్టొచ్చినట్టు కనిపించేది. నవమాసాలూ ఒక్క బిడ్డని తప్ప మరేదీ కడుపులో దాచుకోలేని ఆమె మనస్తత్వం, ఆమెని రచ్చకెక్కించింది! అంతేకానీ, మగవాడికి ఈర్ష్య లేదనీ కాదూ, వుండదనీ కాదు! కాకపోతే అతని తెలివితేటలతో, చాకచక్యంతో బయటపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటాడు.

దాన్ని ఆచారంగా పరిగణించారు! పుణ్యం అని అదే, పిల్లలున్న పెళ్ళామైతే, మళ్లీ పెళ్ళి చేసుకుంటుందనే భయంలేదు కనక, ఆమె 'సతీ' చెయ్యక్కర్లేదా? అందుకే ఆ విషయాన్ని ప్రస్తావించలేదేమో! కానీ, నాగరికత ప్రబలుతూ విద్యావంతులైన స్త్రీ పురుషులు ప్రేమలోపడితే, నాటి స్త్రీ పిల్లలున్న మగాడ్ని భర్తగా ఎలా స్వీకరించిందో, నేడు పురుషుడు పిల్లలున్న స్త్రీని భార్యగా స్వీకరించడానికి సిద్ధంగా వున్నాడు. (అరుదనుకోండి) ఇది అనాదిగా కొన్ని వర్గాలలో జరుగుతూన్నా అంతగా విద్యావంతుల మధ్య జరగలేదు, ఇటువంటి సంఘటనలు!

మరి, ఈ సంగతి గ్రహించిన పెద్దలు, సతితోపాటు సంతతిని కూడా చితిలో తొయ్యమంటారా? దిక్కులేని అనాధలుగా బతకమంటారా? కోడలు పోతే పోయింది కానీ, వారసులని వొదులుకుంటారా? ఇవన్నీ 'సతి'ని ప్రోత్సహించే వారు చెప్పవలసిన సమాధానాలు! నిలదీసి అడుగుతే, ప్రతి విషయంలోనూ ఇందులో ఎంత అమానుషం వుందో, స్త్రీ పట్ల పురుషుడికి ఎటువంటి హీనమైనభావం వుందో అర్థమవుతుంది! సంసారమనే రథానికి భార్యాభర్తలిరువురూ రెండు చక్రాల్లాంటివారు! అసలు ఒకరు ఎక్కువా ఒకరు తక్కువా అనే భావనలే అసహజం. వీరిలో ఏ ఒక్కరు లేకపోయినా సృష్టిలేదు! ఏ ఇద్దరూ భార్యాభర్తలో కలిసి పుట్టరు, కలిసి పోవడానికి!

ఈ ప్రశ్నలని నిలదీసి అడగాలి ఈనాటి మహిళ! ఆడది ఆటబొమ్మో, అంగడి బొమ్మోకాదనీ, తనని తాను పోషించుకోలేని అబలకాదనీ, సహనం, ఓర్పు, నేర్పు, అన్నీ సమపాళ్లలో, రంగరించుకుని ఓపికతో సర్వం భరించిన శక్తి అని గ్రహించాలి!

ఈ అసమానతలు పోయినప్పుడే మనిషి మనిషిగా ఆలోచించ గలుగుతాడు! అక్రమాలను ఆపగలుగుతాడు! ఈ అసమానతలు పోవాలంటే, స్త్రీ విద్యావంతురాలై, ఉద్యోగస్తురాలై, వాక్ స్వాతంత్ర్యాన్ని, ఆర్థిక స్వాతంత్ర్యాన్నీ సంప్రాప్తింప జేసుకుని, సగర్వంగా పురుషునితోపాటు జీవనాన్ని గడపాలి! ఆమె శక్తిని చాటించాలి! ఏమంటారు? ★